సాక్షి
కుమురం భీం
బుధవారం : 13 : మార్చి : 2024



'పది'ంతల ఆత్మవిశ్వాసం

ఐదు రోజుల్లో పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు ఎదుర్కొంటే మంచి ఫలితాలు రాబట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ: 6:26	గురు: 5:04

గరిష్టం/కనిష్టం
38.7 /24.4

వాతావరణం

ఆకాశం నిర్మలంగా, వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. మధ్యాహ్నం వేడి ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.

రికవరీ అయ్యేనా..?



జిల్లాలోని రైస్ మిల్లులో తనిఖీ చేస్తున్న అధికారులు(ఫైల్)

- మరోసారి సీఎంఆర్ అప్పగింతకు గడువు పొడిగింపు
- మే 15 వరకు అనుమతిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు
- 2022- 23 యాసంగి సీజన్‌కు మాత్రమే వర్తింపు
- మిల్లర్లు ఇప్పటివరకు అప్పగించింది తక్కువే..

కౌటాల(సిర్పూర్): ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని తీసుకున్న మిల్లర్లు ధాన్యాన్ని మర ఆడించి బియ్యంగా మార్చి ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. దీంతో సీఎంఆర్ అప్పగింతకు కేంద్ర ప్రభుత్వం మే 15 వరకు అనుమతి ఇచ్చింది. ఇప్పటికే సర్కారు రెండుసార్లు గడువు పెంచగా తాజాగా మరో రెండున్నర నెలల గడువు పెంచింది. ఈ సారైనా మిల్లర్లు బియ్యం అప్పగిస్తారా.. లేదా.. అనేది వేచి చూడాలి. మరోవైపు జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను బయట మార్కెట్‌ల్లో మిల్లర్లు విక్రయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జిల్లాలోని సిర్పూర్(టి), దహెగాం మండలాల్లో రైస్ మిల్లుల్లో కరీంనగర్ టాస్క్‌ఫోర్స్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వరుస దాడులు నిర్వహించారు. సిర్పూర్(టి)లోని రెండు చోట్ల రూ.9 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టినట్లు గుర్తించిన విషయం తెలిసిందే..

ఇచ్చింది తక్కువే..

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా ఏటా రైతుల నుంచి వానాకాలం, యాసంగి సీజన్లలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు కేటాయిస్తుంది. మిల్లర్లు ఆ ధాన్యం మిల్లింగ్ చేసి క్వింటాల్‌కు 67 కిలోల చొప్పున సీఎంఆర్ బియ్యాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించాలి. ఇందుకు ప్రభుత్వం మిల్లర్లకు మిల్లింగ్ చార్జీలు చెల్లిస్తుంది. జిల్లా వ్యాప్తంగా యాసంగి 2022- 23 సీజన్‌కు సంబంధించి 20 మిల్లులకు 24,194 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాలను సీఎంఆర్ కోసం అప్పగించారు. సంబంధిత మిల్లర్లు ధాన్యాన్ని మర ఆడించి 16,212 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ప్రభుత్వానికి (పౌరసరఫరాలశాఖ /ఎఫ్‌సీఐ) అప్పగించాలి. కానీ ఇప్పటివరకు కేవలం 1,711 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం మాత్రమే తిరిగి అప్పగించారు. ఇంకా 14,501 మెట్రిక్ టన్నుల వరకు బియ్యం రావాల్సి ఉంది. జిల్లాలోని 2023- 24 వానాకాలం సీజన్‌కు సంబంధించి 10 మిల్లులకు 6,140 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇచ్చారు. ఇందుకు 4,114 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మిల్లర్లు తిరిగి ఇవ్వాలి. కానీ కొందరు మిల్లర్లు సకాలంలో ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శిస్తున్నారు.

అధిక ధర ఉండడంతో..

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలు వచ్చాయి. ఇదే అదనుగా మిల్లర్లు సీఎంఆర్ నిల్వలను సొమ్ము చేసుకునే పన్నాగం పన్నుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ప్రభుత్వం మిల్లర్లకు ఇవ్వగానే.. వీరు మర ఆడించి మార్కెట్‌లో కిలో రూ.40 నుంచి రూ.50 వరకు విక్రయిస్తున్నారనే ప్రచారం ఉంది. ఫలితంగా మిల్లర్లు రూ.కోట్ల లాభాలు గడిస్తున్నారు. మరోవైపు రాయితీ బియ్యం సేకరించి వీటినే పౌరసరఫరాల శాఖకు సీఎంఆర్‌గా అంటగడుతున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. రైస్ మిల్లుల నుంచి ప్రభుత్వ ధాన్యం మాయమైతే సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ధాన్యాన్ని మర ఆడించి 15 రోజుల్లో మిల్లర్లు, ఎఫ్‌సీఐ లేదా పౌరసరఫరాల శాఖకు ఇవ్వాలి. గడువులోగా అందించని సీఎంఆర్ మిల్లర్లపై 25 శాతం అదనంగా ఇచ్చేలా జరిమానా విధించాలి. రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం.. బియ్యం అందించని వారిని గుర్తించి మళ్లీ ధాన్యం ఇవ్వకుండా బ్లాక్ లిస్టులో ఉంచాలి. ధాన్యాన్ని బయట మార్కెట్‌లో విక్రయించడం, రాయితీ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయడం వంటి అంశాలు తరచూ వెలుగు చూస్తున్నా.. కేవలం 6ఏ కేసులు నమోదు చేస్తున్నారు. రూ.కోట్లు విలువైన ధాన్యం, బియ్యాన్ని కాజేస్తున్న మిల్లర్లపై క్రిమినల్ కేసులు పెట్టి రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం మిల్లులు సీజ్ చేయడం, ఆస్తులను అటాచ్ చేస్తే ఈ పరిస్థితి ఉండదనే అభిప్రాయం ఉంది. ఈ విషయంపై జిల్లా ఇన్‌చార్జి డీఎస్‌ఓ తారామణిని ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు.

సీసీకెమెరాలు, బయోమెట్రిక్ వద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

- రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలి
- జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ ఉద్యోగుల ధర్నా

ఆసిఫాబాద్‌అర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు విధానం ప్రవేశపెట్టాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని అంగన్‌వాడీ ఉద్యోగుల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి త్రివేణి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగుల డిమాండ్లు నెరవేర్చాలని ధర్నా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులను దొంగలుగా చిత్రీకరిస్తూ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ హాజరు విధానం అమలు చేయాలనే నిర్ణయం సరికాదన్నారు. ఒకపూట బడులతో మేలో టీచర్స్, హెల్పర్స్‌కి సెలవులు ఇవ్వాలని, 24 రోజుల సమ్మె హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వేసవిలో ప్రభుత్వ పాఠశాలలతో సమానంగా అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్స్, హెల్పర్లకు ఒకే సారి సెలవులు ఇవ్వాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్ కుటుంబ సర్వే చేయాలని అధికారుల బెదిరింపు చర్యలు మానుకోవాలని కోరారు. గత ప్రభుత్వం రిటైర్మెంట్ బెన్ఫిట్స్ పెంచుతామని, రెండో పీఆర్సీలో ఐదు శాతం ఐఆర్, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేస్తూ జీవో ఇస్తామని, సమ్మెకాలపు వేతనాలు, ప్రమాద బీమా, టీఏ, డీఏలు, మే సెలవులు, ఆన్‌లైన్ ఒకే యాప్ ఉండే విధంగా చూస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ నేటివరకు ఒక్క హామీ కూడా అమలుకు నోచుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు గంగామణి, వనిత, వినోద, ధనలక్ష్మి, రాజేశ్వరి, చంద్రకళ, కమల, తార, మంజుల, లక్ష్మి, పార్వతి, హైమావతి, ఉమాదేవి, మల్లీశ్వరి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మూడో రైల్వేలైన్ ప్రారంభం



ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే, తదితరులు

కాగజ్‌నగర్‌రూరల్: మాకుడి- సిర్పూర్ కాగజ్‌నగర్ (బల్లార్ష- కాజీపేట) మధ్య రూ.2063 కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన రైల్వేలైన్‌తోపాటు రూ.85 వేల కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రధానమంత్రి మోదీ మంగళవారం గుజరాత్ రాజధాని అహ్మదాబాద్ నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి మూడో రైల్వేలైన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడో రైల్వేలైన్‌తో ఎక్కువ రైళ్లు నడపడానికి, రైళ్ల హాల్ట్‌కు అవకాశం ఏర్పడిందన్నారు. సమయపాలన పాటించేందుకు అవకాశం ఏర్పడిందని స్పష్టం చేశారు. సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం, ఇతర రైల్వే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రైల్వే అధికారులకు సూచించారు. అనంతరం వన్‌స్టేషన్ – వన్‌ప్రొడక్ట్(ఓఎస్‌ఓపీ) పథకం కింద సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు మంజూరైన స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు, రైల్వే ఏడీఎన్ గోపి, సీబీఎస్ ఆర్‌బీ భాస్కర్, టికెట్ ట్రావెలింగ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పట్టణ సీఐ శంకరయ్య, ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



వీసీలో పాల్గొన్న అదనపు కలెక్టర్లు, అధికారులు

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి అదనపు ఎన్నికల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం జిల్లాలో పూర్తిస్థాయి బందోబస్తు, నిఘా ఏర్పాట్లు చేయాలని, అధికారులు, సిబ్బంది, ప్రత్యేక బృందాల నియామకం పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, దాసరి వేణు, ఆర్డీవోలు లోకేశ్వర్‌రావు, సురేశ్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అదనపు కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ పోలింగ్ విధుల కోసం ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారుల వివరాలు సేకరించి ఎన్ఐసీ పోర్టల్‌లో నమోదు చేశామని తెలిపారు. సిబ్బంది ఓటరు గుర్తింపు కార్డు, శాసనసభ నియోజకవర్గం, చిరునామా, పోలింగ్ కేంద్రం, పార్ట్, సీరియల్ నంబర్ల వివరాలు సేకరించి నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకొనేందుకు ఏర్పాట్లు చేయడంతోపాటు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ర్యాండమైజేషన్ పూర్తి చేయడానికి చర్యలు తీసుకొన్నామన్నారు. ఎన్నికల కార్యాచరణ వెలువడిన వెంటనే కంట్రోల్ రూం, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.


'డయాలసిస్ రోగులపై నిర్లక్ష్యం తగదు'



వివరాలు తెలుసుకుంటున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకునే రోగులపై నిర్లక్ష్యం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దుర్గం దినకర్, జిల్లా కమిటీ సభ్యులు కార్తీక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించి రోగులతో మాట్లాడారు. డయాలసిస్ కేంద్రంలో నిత్యం 20 మంది రోగులు సేవలు పొందుతారని తెలిపారు. వేసవిలో విద్యుత్ అంతరాయం ఏర్పడే అవకాశం ఉన్నా జనరేటర్‌కు అధికారులు డీజిల్ అందించకలేకపోతున్నారని ఆరోపించారు. జిల్లా ఆస్పత్రికి రూ.కోట్ల నిధులు వస్తున్నా జనరేటర్ సదుపాయం కల్పించకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా డీజిల్ సమకూర్చాలని డిమాండ్ చేశారు.

'పీఎంఈజీపీ'పై నిరుద్యోగులకు అవగాహన



నిరుద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న జనరల్ మేనేజర్ అనసూర్య

రెబ్బెన(ఆసిఫాబాద్): రెబ్బెన మండల కేంద్రంలోని రైతువేదికలో మంగళవారం నిరుద్యోగులకు ప్రధాన మంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం(పీఎంఈజీపీ)పై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కేవీఐబీ జనరల్ మేనేజర్ అనసూర్య మాట్లాడుతూ నిరుద్యోగ యువత స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. స్వశక్తిగా ఎదిగేందుకు పీఎంఈజీపీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పల్లెలు, పట్టణాల్లో నిరుద్యోగ సమస్యలు తీరడంతోపాటు ఉపాధి పొందవచ్చని అన్నారు. అటవీ ఆధారిత పరిశ్రమలు, రసాయన ఆధారిత పరిశ్రమలు, ఇతర కుటీర పరిశ్రమలను పీఎంఈజీపీ ద్వారా రుణాన్ని పొంది ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఉత్పత్తి చేసే రంగానికి రూ.50లక్షలు, సేవా రంగానికి రూ.20లక్షల వరకు సబ్సిడీతో రుణం తీసుకోవచ్చని తెలిపారు. పట్టణ ప్రాంతానికి చెందిన వారికి 25శాతం, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగులకు 35 శాతం సబ్సిడీ లభిస్తుందని పేర్కొన్నారు. అర్హులకు బ్యాంకు మేనేజర్లు సహకరించాలని సూచించారు. అనంతరం సబ్సిడీ రుణాలు పొందడంలో నిరుద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

'దంతన్‌పల్లి' కష్టాలకు చెక్

- 'సాక్షి' కథనాలకు స్పందించిన సింగరేణి యాజమాన్యం
- పునరావాస గ్రామంలో ఫ్లోరింగ్ కోసం రూ.97లక్షలు మంజూరు
- చురుగ్గా కొనసాగుతున్న పనులు



దంతన్‌పల్లి గ్రామంలో కొనసాగుతున్న ఫ్లోరింగ్ పనులు

సాక్షి ఎఫెక్ట్

తిర్యాణి(ఆసిఫాబాద్): సాధారణంగా ఒక్కరోజు భారీ వర్షం కురిసి ఇళ్లలోకి వరద వస్తేనే ఇబ్బందిగా భావిస్తాం.. అలాంటి ఆ గ్రామంలో వర్షం ఉన్నా లేకున్నా ఎప్పుడూ నేల చిత్తడిగా ఉంటుంది. ఊట పడినట్లు ఇళ్లు, వాకిలిలో నిత్యం నీళ్లే ఉంటాయి. గిరిజనులు పడుతున్న అవస్థలపై 'సాక్షి' కథనాలు ప్రచురించడంతో సింగరేణి యాజమాన్యం స్పందించింది. ఊరిలో చిత్తడి ప్రదేశాలు లేకుండా సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేయించేందుకు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం పనులు చురుగ్గా కొనసాగుతుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

తిర్యాణి మండలం దంతన్‌పల్లి గ్రామంలో 110 ఆదివాసీ కుటుంబాలు జీవిస్తున్నాయి. 15 ఏళ్ల క్రితం ఓపెన్ కాస్టు భూసేకరణలో భాగంగా సింగరేణి యాజమాన్యం వారి భూములు సేకరించింది. గ్రామానికి 10 కిలోమీటర్ల దూరంలో గుట్ట కింద ప్రత్యామ్నాయంగా గ్రామస్తులకు అధికారులు పునరావాసం కల్పించారు. అయితే గ్రామానికి సమీపంలో ఎలాంటి నీటి వనరులు లేకున్నా ఓపెన్‌కాస్ట్ కోల్‌యాష్ వ్యర్థాలు, గుట్ట కింది ప్రాంతం కావడం వంటి కారణాలతో రెండేళ్లుగా భూమి నుంచి నీళ్లు ఉబికి రావడం మొదలైంది. వర్షాకాలంలో కనీసం పడుకునేందుకు కూడా స్థలం లేక సిమెంట్ ఇటుకలపై కాలం వెల్లదీశారు.

నిధులు మంజూరు..

దంతన్‌పల్లి గ్రామానికి చెందిన భూముల్లో ఓపెన్ కాస్టు ఏర్పాటు చేసిన సింగరేణి సంస్థ గిరిజనుల కనీస అవసరాలను పట్టించుకోకపోవడంపై 'సాక్షి' పలు కథనాలు ప్రచురించింది. అప్పటి ఎమ్మెల్యే ఆత్రం సక్కు సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్పందించిన సింగరేణి సమస్యల పరిష్కారానికి ముందుకు వచ్చింది. గ్రామంలోని 110 కుటుంబాలకు సంబంధించిన ఇళ్లలోకి నీళ్లు ఉబికి రాకుండా ఉండేందుకు భూమికి ఎత్తుగా సిమెంట్ ఫ్లోరింగ్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందు కోసం రూ.97 లక్షల నిధులు మంజూరు చేసింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటికే పనులు ప్రారంభించారు. త్వరలోనే పనులు కానుండగా.. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం దొరకనుంది.



'సాక్షి'లో ప్రచురితమైన కథనం


పక్కా ఇళ్లు నిర్మించాలి



సింగరేణి సంస్థ నీళ్లు ఉబికి రాకుండా ఉండేందుకు ఇంటి పరిసరాలల్లో ఫ్లోరింగ్ చేస్తుండటం సంతోషకరం. కానీ మాకు పక్కా ఇళ్లు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. మా భూములు తీసుకున్న సింగరేణి సంస్థ నిర్వాసితులకు పక్కా ఇళ్లు కట్టించాలి.

– టేకం రాజు, దంతన్‌పల్లి గ్రామస్తుడు

'స్కౌట్స్ అండ్ గైడ్స్'తో దేశభక్తి



విద్యార్థులు తయారు చేసిన వెదురు కుర్చీని పరిశీలిస్తున్న జీఎం రవిప్రసాద్

రెబ్బెన(ఆసిఫాబాద్): స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం పెరుగుతాయని బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాల మైదానంలో మంగళవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రథమ సోపాన్ క్యాంపు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం క్యాంపు ప్రారంభించారు. స్కౌట్స్ పతకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు మెరుగుపడతాయన్నారు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా జీవించగలమనే ఆత్మస్థైర్యాన్ని ఈ క్యాంపు నేర్పిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. గోలేటి సింగరేణి పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రపతి అవార్డు సొంతం చేసుకోవడంతో పాటు 12 మంది గవర్నర్ అవార్డు అందుకోవడం అభినందనీయమని అన్నారు. అనంతరం క్యాంపులో భాగంగా విద్యార్థులు వెదురుబొంగులతో తయారు చేసిన క్యాంపు, కుర్చీ, ఇతర వస్తువులను పరిశీలించారు. జీఎంతోపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ సీనియర్ చంద్రయ్య సన్మానించారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, ప్రధానోపాధ్యాయుడు సంతోష్, పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల మున్సిపాలిటీగా మారిన ఆసిఫాబాద్ పట్టణంలో సమస్యలు పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో మున్సిపల్ కమిషనర్ భుజంగ్‌రావుకు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ పట్టణంలో సులభ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని, కాలనీల్లో అక్రమంగా నిర్మిస్తున్న ర్యాంపులు తొలగించాలన్నారు. రోడ్లపై ఇసుక, భవన నిర్మాణ సామగ్రి వేస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణంలో నాసిరకమైన తినుబండారాలు విక్రయిస్తున్న వారితోపాటు స్వచ్ఛమైన తాగునీటిని అందించని బేకరీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యలపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట నాయకులు నిఖిల్ ఉన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మంగళవారం సెకండియర్ పరీక్షలకు మొత్తం 4,843 మంది విద్యార్థులకు 4,694 హాజరు కాగా 149 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 4,168 మందికి 4,053 మంది హాజరు కాగా, ఒకేషనల్ విభాగంలో 675 మందికి 641 మంది హాజరయ్యారు.

గోలేటి మీదుగా హైదరాబాద్‌కు బస్సులు

ఆసిఫాబాద్‌అర్బన్/రెబ్బెన: జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో నుంచి నేటి నుంచి వయా రెబ్బెన మండలం గోలేటి మీదుగా హైదరాబాద్‌కు బస్సులు నడపనున్నట్లు డీఎం శ్రీధర్, సింగరేణి బెల్లంపల్లి ఏరియా జీఎం రవిప్రసాద్ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. సింగరేణి యాజమాన్యం విజ్ఞప్తి మేరకు ప్రతిరోజూ ఉదయం 5.45 గంటలకు ఎక్స్‌ప్రెస్ సర్వీసు, రాత్రి 10.45 గంటలకు సూపర్ లగ్జరీ సర్వీసు వయా గోలేటి మీదుగా హైదరాబాద్‌కు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే హైదరాబాద్ నుంచి గోలేటికి రాత్రి 9.30గంటలకు గోలేటి మీదుగా లగ్జరీ బస్సు నడుపుతామని తెలిపారు. ఈ అవకాశాన్ని గోలేటి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న డీఈవో అశోక్

పెంచికల్‌పేట్(సిర్పూర్): విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఈవో పి.అశోక్ అన్నారు. పెంచికల్‌పేట్ మండలం చేడ్వాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవానికి హాజరయ్యారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో సత్తాచాటి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంఈవో రమేశ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి మధుకర్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు రాజ్‌కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని డీఈవో అశోక్ అన్నారు. మండలంలోని పాతసార్సాలలో ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సొంతంగా కథలు చెప్పారు. ఉపాధ్యాయులు తయారు చేసిన బోధన సామగ్రిని పరిశీలించారు. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ కటుకం మధుకర్, ప్రధానోపాధ్యాయులు రాజమణి తదితరులు ఉన్నారు.

గిరిజన పాఠశాల తనిఖీ

బెజ్జూర్(సిర్పూర్): మండలంలోని పాత సోమిని గ్రామంలోని గిరిజన ప్రాథమిక పాఠశాలను జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, కాగజ్‌నగర్ ఏటీడీవో ఖమర్ హుస్సేన్ మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుని గోడలు కూలిపోగా, పైకప్పు కూడా పగుళ్లు తేలడంతో గ్రామంలోని ఎర్మ తిరుపతి ఇంటి ఆవరణలోని పందిరి కింద తరగతులు కొనసాగిస్తున్నారు. దీంతో విద్యార్థుల సౌకర్యార్థం పక్కా భవన నిర్మాణం కోసం ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఎస్సీఆర్పీ పెంద్రం భీక్షమయ్య ఉన్నారు.

క్లుప్తంగా

ఆలయాల్లో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

రామకృష్ణాపూర్: పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వర ఆలయం, మహంకాళి దేవాలయాల్లో ఆదివారం రాత్రి వరుస దొంగతనాలకు పాల్పడిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడిన విషయమై ఆలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ పుటేజీ ఆధారంగా భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి కంది రవిగా గుర్తించి మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఆలయాల్లో చోరీలకు పాల్పడ్డ వ్యక్తిని 24 గంట ల్లోనే అరెస్టు చేసిన ఎస్సై రాజశేఖర్, పోలీస్ సిబ్బందిని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌లు ప్రత్యేకంగా అభినందించారు.

పేలిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగుతున్న మంటలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ అశోక్‌నగర్ బస్తీ సింగరేణి ఏరియా ఆసుపత్రిని ఆనుకుని ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంగళవారం మంటలు అంటుకుని పేలిపోయింది. కొన్నాళ్ల క్రితం విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని డిస్కం అధికారులు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న చెత్తకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని క్రమంగా మంటలు చెలరేగి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అంటుకుని పేలిపోయింది. దీంతో కాల్‌టెక్స్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. సమాచారం అందుకుని విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనతో డిస్కంకు సుమారు రూ.2.50 లక్షల వరకు నష్టం వాటిల్లింది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునఃరుద్ధరించారు.

అట్రాసిటీ కేసులో ఇద్దరికి జైలు


వాంకిడి: అట్రాసిటీ కేసులో ఇద్దరిని జైలుకు తరలించినట్లు ఎస్సై సాగర్ తెలిపారు. మండలంలోని గణేష్‌పూర్ గ్రామానికి చెందిన చిత్రం భీంరావుపై అదే గ్రామానికి చెందిన తండ్రి కొడుకులు షేక్ అబ్దుల్, షేక్ మహబూబ్‌లను కులం పేరుతో తిట్టి, కర్రలతో దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు గతంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను డీఎస్పీ సదయ్య ఆధ్వర్యంలో అరెస్టు చేసి జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వర్చువల్‌గా స్టాళ్ల ప్రారంభం

మంచిర్యాలక్రైం: 'ఒక స్టేషన్.. ఒక ఉత్పత్తి' కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ప్ర ధాని మోదీ మంగళవారం గుజరాత్‌లోని అహ్మదా బాద్ నుంచి వర్చువల్‌గా స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక రైల్వే ఏడీఎస్‌టీఈ సాయికిరణ్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడారు. స్టాల్‌లో అమ్మకాలు జరుపుకొనేందుకు తెల్లరేషన్ కార్డుదారులు అర్హులని పేర్కొన్నారు. 15రోజులు ఒకరికి, 15రోజులు మరొకరికి అవకాశం ఇవ్వనున్నట్లు తెలిపారు. స్వదేశీ వస్తువులు, చేనేత వస్త్రాలు, అల్లిక వస్తువులు, చెక్క బొమ్మలు, గాజులు తదితర వస్తువుల విక్రయానికి అవకాశంకల్పించినట్లు చెప్పారు. బీజేపీ నాయకుడు తుల మధుసూదన్ మాట్లాడుతూ.. దేశాభివృద్ధి నరేంద్ర మోదీతోనే సాధ్యమని కొనియాడారు. రైల్వే సిబ్బంది, బీజేపీ నాయకులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

బెల్లంపల్లిలో స్టేషన్‌లో..

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్‌లోనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా స్టాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వేశాఖ ఏడీఈఈ, టీఆర్డీ ముఖేశ్, బీజేపీ పట్టణాధ్యక్షుడు కోడి రమేశ్, సీటీఐ రాజు, సీఎస్సార్‌లు కేశవరావు, హరిత, సీసీటీసీ మోహిత్, నాయకులు యుగేందర్, రాములు, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



'పది'ంతల ఆత్మవిశ్వాసం

విద్యార్థుల సన్నద్ధతను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి(ఫైల్)

- పది జీపీఏ లక్ష్యంగా... • సన్నద్ధమవుతున్న విద్యార్థులు
- ఈ నెల 18 నుంచి ఎస్సెస్సీ పరీక్షలు • ఇప్పటికే ప్రీఫైనల్, ప్రత్యేక మోడల్ పరీక్షలు పూర్తి

పదో తరగతి పరీక్షలు మరో ఐదురోజుల్లో ప్రారంభం కానున్నాయి. అయితే సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో కొంతమేర ఆందోళన ఉన్నా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలను ఎదుర్కొంటే మంచి ఫలితాలు రాబట్టవచ్చని మానసికనిపుణులు, సబ్జెక్టు విషయ నిపుణులు సూచిస్తున్నారు. విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకం. తొలిసారిగా బోర్డు పరీక్షలు రాయనున్న విద్యార్థులతో పాటు తల్లిదండ్రుల్లో సైతం ఎంతో ఉత్కంఠ నెలకొంటుంది. అయితే ఏడాదంతా చదివిన పాఠాలను మూడు గంటల్లో సమాధానాలు రాసి మంచి ఫలితాలను సాధించాల్సి ఉంటుంది. ఇక్కడ విద్యార్థికి ఒత్తిడి, ఆందోళన సహజమే. అయినా ప్రశాంతంగా ఉంటూ దృఢచిత్తంతో పరీక్షలు రాస్తే సానుకూల ఫలితాలు ఉంటాయి. రానున్న ఐదు రోజులు పాటించాల్సిన జాగ్రత్తలు, పరీక్షలను ఎదుర్కోవాల్సిన తీరును విషయ నిపుణులు ఇలా వివరిస్తున్నారు. – నిర్మల్‌ఖిల్లా

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	విద్యార్థుల సంఖ్య
నిర్మల్	8,923
ఆదిలాబాద్	10,511
మంచిర్యాల	9,637
కుమురంభీం	6,425

మాతృభాషను అశ్రద్ధ చేయొద్దు



మాతృభాషను అశ్రద్ధ చేయకుండా ప్రతీ పాఠ్యాంశాన్ని సంగ్రహాత్మకంగా చదవాలి. ఉపవాచకం చదవడం, ముఖ్య ఘట్టాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ పెరుగుతుంది. పరిచిత, అపరిచిత పద్య, గద్యాలను బాగా చదివి అర్థం చేసుకోవడం ద్వారా సమాధానాలు సులభంగా రాయవచ్చు. లేఖ, కరపత్రం, సంభాషణ, వ్యాసం, ఆత్మకథ, ఏకపాత్రాభినయం వంటివాటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. ఓవైపు సాధన చేస్తూనే మరోవైపు ఉల్లాసంగా ఉండాలి. సంధులు, సమాసాలు వంటివాటికీ సమయం కేటాయించి చదివితే పూర్తి మార్కులు సాధించవచ్చు.
– కొండూరి పోతన్న, తెలుగు విషయ నిపుణులు, జెడ్పీహెచ్ఎస్, వెల్మల్ బొప్పారం

పొందికగా రాస్తే హిందీకే మార్కులు



హిందీ జాతీయ భాష. ఇందులో ఎక్కువ మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుంది. ప్యాసేజీ రైటింగ్‌లో ఇచ్చిన అంశాన్ని క్షుణ్ణంగా చదివితే జవాబులు ఈజీగా రాబట్టవచ్చు. ప్రతీ పాఠ్యాంశంలోని కవి పరిచయాన్ని పూర్తిగా చదవాలి. వ్యాకరణాంశాలు, భాషకి బాత్, అభ్యాసం చేయాలి. సంధులు, ఉపసర్గ వంటివి నేర్చుకుంటే సులభంగానే 10 జీపీఏ సాధించవచ్చు. ఇక పార్ట్ బి పైన కూడా కొట్టివేత, రాత దోషాలు లేకుండా రాయాలి. పద్యభాగం భక్తిపథ్, నీతి దోహే పాఠ్యాంశాలు ముఖ్యమైనవి.– కే.రేఖ, హిందీ పండిత్, జెడ్పీహెచ్ఎస్, మంజులాపూర్

కృత్యాలు, అనువర్తనాలు ఆకళింపు ముఖ్యం



భౌతిక రసాయన శాస్త్రాల్లోని ప్రతీ అంశానికి సంబంధించిన కీలక పదాలు చదవాలి. పాఠ్యాంశాల్లోని కృత్యాలు, బొమ్మలు, అనువర్తనాలు గుర్తించుకుని చదివితే జ్ఞాపకముంటుంది. రోజూ సమాధానాలను సాధన చేయడం ద్వారా మంచి మార్కులను సాధించవచ్చు. ఉపయోగాలు–అనువర్తనాలు చదవాలి. ప్రతీ యూనిట్ పూర్తయ్యాక పునఃశ్చరణ చాలా ముఖ్యం. గత పరీక్ష ప్రశ్నలను సాధన చేస్తే ప్రశ్నలు ఏ విధంగా అడుగుతున్నారో గ్రహించవచ్చు. – సీహెచ్ వందన, భౌతికశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్, భోసి

విశ్లేషణ ద్వారానే మంచి మార్కులు



సాంఘిక శాస్త్రంలో పాఠ్యాంశాలను విశ్లేషణ పూరితంగా చదివితే సులువుగా గుర్తుంటాయి. కీలక అంశాలు, దేశ, ప్రపంచ పటాలను సాధన చేయడం వల్ల స్కోరింగ్ చేయవచ్చు. భారతదేశ పటంలోని పీఠభూములు, తీరమైదాన ప్రాంతాలు, నదులు, రాష్ట్రాలు గుర్తించేలా ప్రాక్టీసు చేయాలి. ప్రపంచ పటంలో దేశాలు, ప్రధాన కార్యాలయాలు, సముద్రాలను గుర్తించగలగాలి. భూగోళం, భూగర్భ జలాలు, కుల వివక్ష, బాలిక విద్య వంటి అంశాలపై, భారతదేశ చరిత్ర వంటి విషయాలను విశ్లేషణచేస్తూ చదవాలి. ప్రతీ ప్రశ్నను అటెంప్ట్ చేయడం కీలకం.
– సిలారి మధు, సాంఘికశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

ఇష్టపడి చదివితే ఇంగ్లిష్ ఈజీ



ప్రశ్న పత్రం తీసుకున్న తర్వాత అందులో ఉన్న ప్రశ్నలను చూసి ఆందోళన చెందకూడదు. క్షుణ్ణంగా చదివి ఏ ప్రశ్నకు ఎలాంటి సమాధానం రాయనున్నామో ఆకళింపు చేసుకోవాలి. పేరాగ్రాఫ్‌లోని పదాలను కాకుండా సమగ్రంగా అర్థాలు వచ్చే పదాలను ఉపయోగించడం వల్ల సమాధాన పత్రం దిద్దేవారికి మంచి భావన ఏర్పడుతుంది. అక్షర దోషాలు లేకుండా చూడాలి. పదాలను అర్థవంతంగా రాయాలి. వ్యాకరణ సాధన కీలకం. బాగా వచ్చిన సమాధానాలను మొదట రాసి క్లిష్టతరమైనవి చివర్లో రాస్తే ఆలోచించడానికి సమయం ఉంటుంది.
– కదార్ల రవీంద్ర, ఆంగ్లభాషా విషయనిపుణులు, నిర్మల్

పట్టు చిక్కితే గణితమే సరళం



గణితం అంటేనే విద్యార్థులు కష్టతరం, క్లిష్టతరం అని భావిస్తారు. కానీ తగిన సాధన చేస్తే గణితంలోనే ఎక్కువ మార్కులు సాధించే అవకాశం ఉంది. తగిన చిట్కాలు పాటించడంతో గణితంపై ఆసక్తి పెరుగుతుంది. సమితులు, రేఖా గణితం, సాంఖ్యాక శాస్త్రం, త్రికోణమితి వంటి పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. గ్రాఫ్ నిర్మాణాలకు సంబంధించిన సమస్యలను అభ్యసన చేయాలి. ప్రాక్టీస్ చేస్తే సమాధానాలు సులభంగా రాయవచ్చు. – పెంట అశోక్, గణితశాస్త్ర విషయ నిపుణులు, నిర్మల్

అభ్యసన దీపికలతో ప్రయోజనం



జీవశాస్త్రంలో బొమ్మలు గీయడం, ప్రయోగాలు నిజ జీవిత వినియోగం వంటి అంశాలపై వచ్చే ప్రశ్నల ద్వారా ఎక్కువ మార్కులు స్కోర్ చేయవచ్చు. అభ్యసన దీపికలు ఇందుకు అనుకూలంగా ఉన్నాయి. – మధుసూదన్ దేశ్‌పాండే, జీవశాస్త్ర ఉపాధ్యాయులు, జెడ్పీహెచ్ఎస్,సోన్

కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలు తేవాలి

- ఏఐటీయూసీ నాయకుల డిమాండ్



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: పాతబడిన ఎస్‌డీఎల్ యంత్రాలను తీసివేసి కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలను తేవాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కె.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కే బాజీసైదాలు ఆర్కే న్యూటెక గనిపై కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గని మేనేజర్ స్వామి రాజుతో భేటీ అయి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. కాలంచెల్లిన ఎస్‌డీఎల్ యంత్రాలను నడపడంతో ఆపరేటర్లు ఇబ్బంది పడుతున్నారన్నారు. కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సపోర్టుమెన్‌లకు పనిచేసే స్థలంలో మెటీరియల్స్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. వర్క్ నామ్స్ ప్రకారం కార్మికులకు పనులు కేటాయించకుండా తక్కువ మందిని కేటాయించడంతో వారిపై పనిభారం పడుతుందన్నారు. జనరల్ షిఫ్ట్ విడుదల హాజరైన కార్మికులను జన్మభూమి పేరుతో నానా రకాల పనులు చేయిస్తున్నారని, ఈ విధానం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఆరుగురితో చేసే లైన్మెన్ పనికి కేవలం నలుగురిని మాత్రమే పంపుతున్నారని, దీంతో వారు పని భారంతో సతమతమవుతున్నారన్నారు. మెనూ ప్రకారం క్యాంటీన్‌లో నాణ్యమైన అల్పాహారాన్ని అందించాలన్నారు. ఇతర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరించాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టే కిషన్‌రావు ఏరియా కార్యదర్శి సంపత్, ఫిట్ కార్యదర్శి ఆకుల లక్ష్మణ్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, ఫిట్ సహాయ కార్యదర్శి సందీప్ నాయకులు నరసయ్య, శంకరయ్య, అజయ్, నారాయణ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అవగాహనతో వ్యాధులకు దూరం

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. మంగళవారం శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో కంపెనీ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ, అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఉద్యోగులు తరచూ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలన్నారు. ముఖ్యంగా మహిళలు తమ ఆరోగ్యంపై అత్యంత శ్రద్ధ కనబర్చాలని తెలిపారు. వయస్సుతో పాటు వచ్చే కొన్ని దీర్ఘకాలిక జబ్బులపై అవగాహన కలిగి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వాటి బారిన పడకుండా ఉండగలుగుతామన్నారు. అనంతరం కంపెనీ వైద్యులు కిడ్నీ, క్యాన్సర్ జబ్బులపై అవగాహన కల్పించారు. అడిషనల్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉషా, జనరల్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్, గైనకాలజిస్ట్ హరిత వ్యాధులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా సేవా అధ్యక్షురాలు రాధాకుమారి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఏరియా ఎస్‌ఓటుజీఎం పురుషోత్తంరెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ కాంతారావు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్‌కు అవార్డులు



అవార్డులతో లయన్స్ క్లబ్ సభ్యులు

మంచిర్యాలటౌన్: లయన్స్ క్లబ్ మంచిర్యాల ఆధ్వర్యంలో గత ఏడాది జులై నుంచి ఫిబ్రవరి వరకూ చేపట్టిన వివిధ సేవ కార్యక్రమాలకు మంగళవారం 18 అవార్డులను పొందారు. బెస్ట్ ప్రెసిడెంట్‌గా బాలాజీ, బెస్ట్ సెక్రటరీగా వెంకటేశ్వర్లు, ట్రెజరర్ రామస్వామి, బెస్ట్ క్లబ్‌గా మంచిర్యాల లయన్స్ క్లబ్, బెస్ట్ డిస్ట్రిక్ట్ చైర్‌పర్సన్‌గా మధుసూదన్‌రెడ్డి, వరప్రసాద్, గుండా శ్రీనివాస్, వీరస్వామి, వి.వినయ్‌కుమార్, పి.హన్మంతరావు, కిష్టయ్య, సిరిపురం శ్రీనివాస్, ఎం.రామాంజనేయులు, కొత్త సురేందర్, గోలి రాము, డేగ బాబు, సత్యపాల్ రెడ్డి, సేవా కార్యక్రమాలు హంగర్ రిలీఫ్ ప్రోగ్రాం, ఫ్రీ ఐ సర్జికల్ క్యాంప్‌లు, బ్లడ్ డొనేషన్ క్యాంపులు, హెల్త్ క్యాంపు అవార్డులను పొందారు.

చిన్ననాటి స్నేహితుడికి జస్టిస్ చంద్రయ్య పరామర్శ



సత్యనారాయణతో జస్టిస్ చంద్రయ్య

జన్నారం: చిన్ననాటి స్నేహితుడు జన్నారం మండలం తపాలపూర్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ కమ్మల సత్యనారాయణను మంగళవారం మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య పరామర్శించారు. హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో కిడ్నీ సంబంధిత సమస్యలపై చికిత్స పొందుతున్న అతడిని పరామర్శించి యోగా క్షేమాలు తెలుసుకున్నారు.

హామీలు నెరవేరుస్తాం



మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు ఏఐటీయూసీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. మంగళవారం ఏరియాలోని కేకే–5గనిపై నిర్వహించిన సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. ఇంతవరకు సింగరేణి యాజమాన్యం గుర్తింపు పత్రం అందించలేదని ఈ విషయంలో పలుమార్లు సీఎండీని కలిశామని ఈ నెల చివరి వారంలో తప్పకుండా గుర్తింపుపత్రం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సుదర్శన్, శ్రీనివాస్ రాజేశం, సంపత్ తదితరులు ఉన్నారు.

గ్రాట్యుటీ పెంచాలి

శ్రీరాంపూర్: బొగ్గుగని కార్మికులకు ప్రస్తుతం ఇస్తున్న రూ.20లక్షల గ్రాట్యుటీని రూ.25 లక్షలకు పెంచాలని ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జట్టి శంకర్‌రావు సోమవారం కోలిండియా, సింగరేణి యాజమాన్యాలను డిమాండ్ చేశారు. కేంద్రం ప్రభుత్వ ఉద్యోగులకు గ్రాట్యుటీ రూ.20లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచుతూ మార్చి 7, 2024న కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందన్నారు. దీన్ని మార్చి ఆగస్టు 8, 2024 నుంచి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమ యూనియన్ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రికి, కోలిండియా యాజమాన్యంకు లేఖ రాశారన్నారు. వెంటనే గ్రాట్యుటీపై ఉన్న రూ.20లక్షల సీలింగ్‌ను ఎత్తివేసి రూ.25 లక్షలు చేయాలన్నారు.

జోడువాగుల వద్ద వంతెన నిర్మించాలి

- సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర



పాదయాత్రలో సీపీఎం నాయకులు

భీమారం: మంచిర్యాల –చెన్నూరు జాతీయ రహదారిలో జోడువాగుల వద్ద రెండు వరసల రహదారితో పాటు వంతెన నిర్మించాలని డిమాండ్ చేస్తూ జోడువాగు నుంచి భీమారం వరకు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం మహిళలు, ప్రజాసంఘాల కార్యకర్తలు కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం భీమారం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి మాట్లాడుతూ ఎంతో కీలకమైన ఈ జాతీయ రహదారిలోని జోడువాగుల వద్ద దాదాపు రెండు కిలో మీటర్లు రోడ్డు విస్తరించలేదని పేర్కొన్నారు. అదే విధంగా సింగిల్ రోడ్డు వంతెన స్థితిలావస్థకి చేరుకుందని దాని స్థానంలో కొత్త వంతెన నిర్మించాల్సి ఉండగా దాదాపు 15 ఏళ్ల నుంచి అటవీశాఖ అనుమతులు లేక పనులను చేపట్టడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం అది కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న జాతీయ రహదారి నిర్మాణం విషయంలో అటవీశాఖ నుంచి అనుమతులు రావడం లేదని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. జోడువాగు వద్ద సింగిల్ రోడ్డు పూర్తిగా ధ్వంసం కాగా రెండు కిలోమీటర్ల పొడువు వాహన చోదకులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. అదే విధంగా ఇందారం క్రాస్ రోడ్డు నుంచి చేపట్టిన రోడ్డు పనులు ఇప్పటికీ వరకు పూర్తి కాలేదని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా వంతెన నిర్మించి రోడ్డు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. ఇందులో మహిళా సంఘాలు జిల్లా కార్యవర్గ సభ్యులు బొడెంకె చందు, సీఐటీయూ నాయకులు దుంపల రంజిత్‌కుమార్, ఐద్వా నాయకులు నిర్మల, నాగజ్యోతి పాల్గొన్నారు.

గెలుపోటములు స్ఫూర్తిగా తీసుకోవాలి



బహుమతులు ఇస్తున్న ఎఫ్‌డీవో విజయ్‌కుమార్

కాసిపేట: క్రీడాకారులు గెలుపోటములు స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని అటవీశాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం మండలంలోని తాటిగూడలో అటవీశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందించారు. మొదటి బహుమతి బుగ్గగూడ జట్టు, రెండో బహుమతి రాంపూర్ జట్లు గెలుపొందాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు వెళ్లకుండా క్రీడలు పని చేస్తాయని అటవీశాఖ ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు నిర్వహించడంతో పాటు అటవీ పరిరక్షణ, పర్యావరణ సమతుల్యతపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. చదువుతో పాటు క్రీడల్లో ముందుకు సాగుతూ జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో సుభాష్, డెప్యూటీ రేంజ్ ఆఫీసర్ ప్రవీణ్ నాయక్, ఎఫ్‌బీవోలు సురేష్, కుమారస్వామి, యుగేందర్ పాల్గొన్నారు.

హోలీ పండుగకు ప్రత్యేక రైళ్లు

బెల్లంపల్లి: హోలీ పర్వదినాన్ని పురస్కరించుకుని రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను వివిధ ప్రాంతాలకు నడిపించడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా సికింద్రాబాద్ – గోమతినగర్, (లక్నో), సికింద్రాబాద్ –దర్భంగా, హైదరాబాద్(నాంపల్లి)– పాట్నా మార్గాల్లో హోలీ ప్రత్యేక రైళ్లు ఇరువైపులా రాకపోకలు సాగిస్తాయి. సికింద్రాబాద్ నుంచి బిహార్ ముజఫర్‌పూర్ జంక్షన్ వరకు ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి. ఆయా ప్రత్యేక రైళ్లు ఈ నెల 21, 28 తేదీల్లో, ఏప్రిల్ 4వ తేదీన బయల్దేరతాయి. హోలీ ప్రత్యేక రైళ్లకు రాష్ట్రంలోని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ కల్పిస్తూ రైల్వేశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సికింద్రాబాద్ జంక్షన్, కాజీపేట జంక్షన్, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్‌లతో పాటు మంచిర్యాల, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌లలో హాల్టింగ్‌కు అవకాశం కలిపించింది. ప్రత్యేక రైళ్లు కేవలం ఒక ట్రిప్ మాత్రమే నడువనున్నాయి. ప్రత్యేక రైళ్ల సౌకర్యాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించిన వారి కుల విచారణ



సోమిని గ్రామంలో విచారణ చేస్తున్న అధికారులు

బెజ్జూర్: మండలంలోని గబ్బాయి, లంబడిగూడ, కుకుడ, సోమిని గ్రామాలకు చెందిన నలుగురు అమ్మాయిలు నెల రోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రుల్లో స్టాఫ్ నర్సులుగా ఉద్యోగాలు పొందారు. ఆదివాసీ గిరిజన యువతుల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ కోయ కులం గెజిట్లో లేనందున వారి ఉద్యోగ నియామక పత్రాన్ని ఇవ్వకుండా వారు ఆదివాసీలా.. కాదా అనే దానిపై మంగళవారం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, ఏటీడీవో ఖమర్ హుస్సేన్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత్‌రావు లు ఆయా గ్రామాలలో విచారణ చేపట్టారు. విచారణలో జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీటీసీ ఆత్రం సాయి తదితరులు పాల్గొన్నారు.